

ఎన్నికలకు టీడీపీ సిద్ధం

సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి టీడీపీ సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో వైసీపీతో తలపడే రేసుగుర్రాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. జగన్ అడ్డా కడప గడ్డలో తొలిజాబితాలో కడప, పులివెందుల, మైదుకూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగతా నాలుగు నియోజకవర్గాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థులను ప్రకటించిన మూడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

- మొదటి జాబితాలో ముగ్గురు అభ్యర్థుల ప్రకటన
- జగన్ అడ్డా నుంచే మొదలైన అభ్యర్థుల ఖరారు
- కడప నుంచి మాధవీరెడ్డి, పులివెందుల నుంచి బీటెక్ రవి, మైదుకూరు నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్ బరిలో..
- ఆ నాలుగు చోట్ల అభ్యర్థులకు ఉత్కంఠ



మైదుకూరు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పుట్టా సుధాకర్ యాదవ్‌కు స్వీట్ తినిపిస్తున్న టీడీపీ నేతలు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు శనివారం ఉండవల్లిలో సంయుక్తంగా తొలిజాబితా అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో భాగంగా కడప అసెంబ్లీకి టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి ఆర్.మాధవీరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. ఇక పులివెందులకు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని ఖరారు చేయగా, మైదుకూరు నియోజకవర్గానికి మరోమారు పుట్టా సుధాకర్‌యాదవ్ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. వీరు ముగ్గురూ ఆయా నియోజకవర్గాలకు ప్రస్తుతం ఇన్‌చార్జిలుగా ఉన్నారు.

జగన్ సొంత గడ్డ నుంచే

కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలుండగా మూడు చోట్ల అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించారు. కడప అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఐదు నెలల క్రితం ఆర్.మాధవీరెడ్డిని నియమించారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట మాధవీరెడ్డి రాకెట్‌లా ఇంటింటికీ దూసుకెళుతున్నారు. బాదుడేబాదుడుతో జగన్ జనంపై మోపిన పన్నుల భారాన్ని ప్రభుత్వ వైఫల్యాలను జనాల్లోకి తీసుకెళుతున్నారు. జనాలతో మమేకమవుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని ఇప్పటికే ప్రారంభించారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అండ్ కో వైఫల్యాలను వివరిస్తూ జనాలకు అర్థమయ్యే విధంగా సూటిగా మాట్లాడుతున్నారు.

మరోసారి పులివెందులకు బీటెక్ రవి

సీఎం జగన్ సొంత గడ్డ పులివెందుల నుంచి మరోసారి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బరిలో దిగనున్నారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి టీడీపీ నుంచి బయటికి వెళ్లిన తరువాత బీటెక్ రవిని పులివెందుల ఇన్‌చార్జిగా పెట్టారు. బాబు షూరిటీ పేరిట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పులివెందులలో టీడీపీకి సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వివేకా హత్య కేసులో వైఎస్ కుటుంబీకుల పాత్ర, జగన్ పాలనలో పులివెందులలో సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ఎత్తి చూపుతున్నారు.

మరోసాని మైదుకూరు నుంచి పుట్టానే

టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్‌కు చంద్రబాబునాయుడు మరోసారి అవకాశం కల్పించారు. ఈయన 2014, 2019 ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ ఆయనే పోటీ చేయనున్నారు. 2014లో ఓటమి చెందినప్పటికీ అప్పుడు టీడీపీ అధికారం చేపట్టడంతో ఆయనను టీటీడీ చైర్మన్‌గా నియమించారు. ఈ పర్యాయం మళ్లీ ఆయనే మైదుకూరు నుంచి ఎన్నికలో బరిలో దిగుతున్నారు.

ఆ నాలుగుచోట్ల తొలగని ఉత్కంఠ

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేయనున్నాయి. బీజేపీ కూడా పొత్తులో ఉంటుందని అంటున్నా ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. కాగా తొలి జాబితాలో కమలాపురం, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది. శనివారం తొలివిడత అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారనే విషయం తెలియగానే టీడీపీతో పాటు వైసీపీ శ్రేణులు టీవీలకు అతుక్కుపోయి అభ్యర్థుల అప్‌డేట్ కోసం ఎదురుచూశారు. మొదటి విడతలో ముగ్గురిని మాత్రమే ప్రకటించారు. పొత్తుల కారణంగా సీట్లు మారుతాయనే చర్చ ఉంది. అభ్యర్థులను ఆచితూచి ప్రకటిస్తున్నారు. తుది జాబితాలో మిగిలిన నాలుగు స్థానాలకు ఎవరనేది ప్రకటించనున్నారు. అప్పటి వరకూ అక్కడ ఉత్కంఠ తప్పదు. కాగా మొదటి విడతలో అభ్యర్థులు ఖరారు కావడంతో కడప, పులివెందుల, మైదుకూరులో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు.

ఆర్.మాధవీరెడ్డిని కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ సంబరాలు



మైదుకూరులో టీడీపీ జెండా పాతుతాం..



మైదుకూరు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడుతుంది. ఈ సారి నేనే గెలుస్తున్నా. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి లేదు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూకబ్జాలు ఇతర అక్రమాలకు పాల్పడుతున్నారు. వారితో జనం విసిగిపోయారు. 2014 -19 టీడీపీ హయాంలో నేను నియోజకవర్గంలో రూ.950 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. అవన్నీ జనానికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత టీడీపీ పాలన, ఇప్పటి జగన్ పాలన బేరీజు వేసుకుంటున్నారు. అబివృద్ధి అప్పుడే జరిగింది. ఇప్పుడేమీ లేదని జనం నిర్ధారించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తారు.

- పుట్టా సుధాకర్‌యాదవ్, మైదుకూరు టీడీపీ అభ్యర్థి

ఈసారి పులివెందుల టీడీపీదే..



బాబు షూరిటీ పేరిట పులివెందుల మున్సిపాలిటీ, వేంపల్లె, ఇతర మండలాల్లో తిరిగేటప్పుడు జనం నుంచి అపూర్వ స్పందన వస్తోంది. ఐదేళ్ల జగన్ అహంకారాన్ని పులివెందుల వాసులు భరించలేక విసిగిపోయారు. వివేకానందరెడ్డిని దారుణంగా హత్య చేశారు. సొంత చెల్లెళ్లు షర్మిల, సునీతలపై వేధింపులు ఎక్కువయ్యాయి. వీటన్నింటినీ జనం గమనిస్తున్నారు. జగన్ అహంకారానికి విసిగిపోయిన జనం ఈసారి ఆయనను ఇంటికి సాగనంపాలని అనుకున్నారు. జన స్పందన చూస్తే ఈసారి పులివెందుల మాదే. ఇప్పటికే వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఇంకా చాలా మంది పెద్ద పెద్ద నేతలు టీడీపీలోకి వస్తారు.

- బీటెక్ రవి, పులివెందుల టీడీపీ అభ్యర్థి

కడప సీటును చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తా..



నాపై ఎంతో నమ్మకంతో కడప అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు. కడప సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తా. 2019 ఎన్నికల్లో కడప జనం పొరపాటున వైసీపీకి ఓటు వేసి అంజద్‌బాషాను గెలిపించారు. ఆయన ఐదేళ్లపాలనలో కడపలో మౌలిక వసతులు లేవు. గంజాయికి అడ్డాగా మారింది. విద్యార్థుల నుంచి అందరూ గంజాయికి అలవాటుపడుతున్నారు. కొన్ని డివిజన్లు అయితే గంజాయి మత్తులో ఊగిసలాడుతున్నాయి. స్థానికంగా ఉపాధి లేక చాలా మంది గల్ఫ్‌కు వెళ్లారు. ఇక్కడ ఇళ్లల్లో ఒంటరి మహిళలు ఉన్నారు. గంజాయి కారణంగా అలాంటి మహిళలకు కడపలో రక్షణ లేకుండా పోతోంది. పోలీసులు కూడా అదుపు చేయలేకపోతున్నారు. అంజద్‌బాషా తమ స్వార్థం కోసం అల్లరి మూకలను వెంటేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికలు చాలా కీలకమైనవి. ఈసారి చంద్రబాబు సీఎం అయితేనే కడప సేఫ్‌గా ఉంటుంది. కడపను భూకబ్జాలు, గంజాయి లేని సిటీగా మారుస్తా.

- ఆర్.మాధవీరెడ్డి, కడప టీడీపీ అభ్యర్థి

విచారణకోసం వచ్చిన పోలీసులపై దాడి

- 8మందిపై కేసు నమోదు


మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 24: బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ కోసం వచ్చిన హైదరాబాదు పోలీసులను మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లె గ్రామస్తులు కొట్టి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన కొంతమంది హైదరాబాదులో రూ.50లక్షల విలువచేసే గొర్రెలను కొనుగోలు చేశారు. అయితే కొనుగోలుదారులు వారికి డబ్బు ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా స్పందించక పోవడంతో గొర్రెలను అమ్మినవారు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఫిర్యాదు దారుడితో కలసి ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లతో కలసి శుక్రవారం రాత్రి చిన్నయ్యగారిపల్లెకు వచ్చారు. వచ్చిన వారిలో ఒక కానిస్టేబుల్ మాత్రం యూనిఫాంలో ఉండగా మిగిలిన నలుగురూ సివిల్ డ్రెస్‌లో ఉన్నారు. కాగా.. కొనుగోలు దారులలో ఒకరైన శివకుమార్ గ్రామస్తులతో కలిసి విచారణకోసం వచ్చిన పోలీసులను కొట్టి గాయపరిచారు. గాయపడ్డ పోలీసులను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారు హైదరాబాదు వెళ్లిపోయారని తెలిసింది. ఈ ఘటనపై 8 మందిపై కేసు నమోదు చేశామని మైదుకూరు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. నిందితులలో శీను, సాంబయ్య, రవి, వంశీతో పాటు మరో నలుగురు ఉన్నారని.. వారిలో ముగ్గురు మహిళలున్నారని ఎస్ఐ తెలిపారు. హైదరాబాదు పోలీసులు విచారణకు వచ్చిన సమయంలో తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. వచ్చిన వారిలో ఒకరు యూనిఫాంలో ఉన్నారని, పోలీసులని తెలిసే గ్రామస్తులు దాడి చేశారన్నారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : ఆర్ఐవో


కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షల విధివిధానాలపై శనివారం కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో సీఎస్, డీవో, అడిషనల్ సీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వతేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. డీవీఈవో జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు సూచనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. సభ్యులు వెంకటసుబ్బయ్య, మురళీధర్‌రావు, ప్రసాద్‌రెడ్డి, ఆర్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు చిన్నకూతురికి రెండు ఓట్లు

- డబుల్ ఎంట్రీల తొలగింపులో బీఎల్‌వోల నిర్లక్ష్యం


995
AAP1842996
ఓటరు పేరు : క్రిష్ణ కావ్య రాచమల్లు
తండ్రి పేరు: శివ ప్రసాద్ రెడ్డి రాచమల్లు
ఇంటి సంఖ్య : 28/391
వయస్సు : 27 లింగము : స్త్రీ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 24: ప్రొద్దుటూరు నియోజకర్గానికి సంబంధించిన తుది ఓటరు జాబితాలో ఇప్పటికీ డబుల్ ఎంట్రీలు, డెత్‌ల ఓట్లు బయటపడుతున్నాయి. తాజాగా ఎమ్మెల్యే రాచమల్లు చిన్న కుమార్తె కృష్ణ కావ్యకు రెండు ఓట్లు ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈమెకు రామేశ్వరం 28 వార్డులోని 184 బూతులో రెండు ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఓటరు సీరియల్ నెంబరు 784 కాగా ఆయన పక్కనే చిన్న కూతురు కృష్ణ కావ్యది 785గా నమోదయింది. ఇందులో ఆమె ఎపిక్ నెంబరు ఏఏపీ 1618677గా, వయసు 28 సంవత్సరాలుగా ఉంది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఇంటి నెంబరు 28-391 కాగా కృష్ణ కావ్యది అదే డోర్‌నెంబరు. తండ్రి పేరు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గానే ఉంది. ఫొటో మాత్రం సరిగా లేదు. అలాగే ఇదే 184 బూతులో సీరియల్‌నెంబరు 995లో కూడా క్రిష్ణ కావ్య రాచమల్లు పేర మరో ఓటు నమోదయింది. ఇందులో ఆమె ఎపిక్‌నెంబరు ఏఏపీ 1842996గా నమోదయింది. తండ్రిపేరు, ఇంటి చిరునామా అంతా అదే. అయితే వయసు మాత్రం ఇందులో 27గా ఉంది. ఫొటో స్పష్టంగా ఉంది. కేవలం 'కృష్ణ' 'క్రిష్ణ' అనే పేర్లు, ఒక్క ఏడాది వయసు తేడాదో ఆమెకు రెండు ఓట్లు నమోదయ్యాయి. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకే డబుల్ ఎంట్రీలున్నా ఎందుకు ఫైనల్ జాబితాలో తొలగించలేదో అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. బీఎల్‌వోల నిర్లక్ష్యంతో పాటు నాయకుల ఎత్తుగడలు ఇందులో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


785
AAP1618677
ఓటరు పేరు : కృష్ణ కావ్య రాచమల్లు
తండ్రి పేరు: శివ ప్రసాద్ రెడ్డి రా చ మ ల్లు
ఇంటి సంఖ్య : 28-391
వయస్సు : 28 లింగము : స్త్రీ

సీఎం సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ మునీర్, పలువురు వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ మునీర్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 24: వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన 19వవార్డు కౌన్సిలర్ మునీర్ శనివారం దస్తగిరిపేటలో సీఎం సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మునీర్‌వెంట పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సీఎం సురేశ్‌నాయుడు మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజలమీద పన్నుల భారం మోపారన్నారు. ప్రొద్దుటూరులో ఇళ్లు లేని వారికి రెండు సెంట్లలో పైసా లేకుండా ఇళ్లుకట్టి ఒకచేత్తో తాళాలు మరోచేత్తో పట్టాను అందిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఏడాదికి రూ.500 వందల కోట్ల మేర ఐదేళ్లలో రూ.2500 కోట్లు తెచ్చి ప్రొద్దుటూరును సుందరనగరంగా తీర్చిదిద్దుతానని చెప్పి పైసా నిధులు తీసుకురాలేక పోయారన్నారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డిలకు తప్ప ఎవ్వరికీ ఎలాంటి అధికారాలు లేవన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు గారడీ మాటలకు మరోసారి ప్రొద్దుటూరు ప్రజలు మోసపోవద్దని టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ మునీర్ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా 1000 ఓట్ల మోజారిటీతో గెలిచినా వార్డు అభివృద్ధికి మున్సిపాలిటీ నుంచి నిధులు మంజూరు చేయలేదన్నారు. విలువ లేనిచోట ఉండకూడదని పార్టీ మారుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఖలీల్, నల్లబోతుల నాగరాజు, జనసేన ఇన్‌చార్జ్ జిలాన్, టీడీపీ 19 వార్డు ఇన్‌చార్జి పిట్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

కడప (క్రైం), ఫిబ్రవరి 24: జిల్లాలో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి ఒంటి గంట వరకు జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. గ్రూప్-2 పరీక్ష నేపథ్యంలో.. ఐదుగురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, హెచ్‌సీలు, 160 మది కానిస్టేబుళ్లు, 80 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్ల బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరులోని పరీక్ష కేంద్రాల నిర్వహణకు 17 రూట్ మొబైళ్ల ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్ష పూర్తయ్యేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు అనుమతించమని తెలిపారు. సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్‌వాచ్‌లు మొదలైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్నా కంట్రోల్ రూము ఫోన్ నెం.08562-246344కు కాల్ చేయాలని సూచించారు.

నిరుద్యోగులకు వయోవేతన

- 42 ఏళ్ల పరిమితిపై కన్నీరు మున్నీరు
- కాళ్లవేళ్లా పడినా చలించని వైసీపీ ప్రభుత్వం
- పోటీ పరీక్షలకు అర్హత కోల్పోయిన వేలమంది నిరుద్యోగులు
- వయో పరిమితి పెంచాలని డిమాండ్

ఒక్క చాన్స్ అంటూ వేడుకుని జగన్ సీఎం అయ్యారు. నిరుద్యోగులకు మాత్రం ఒక్కచాన్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. వయో పరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచమని నిరుద్యోగులు నెలల తరబడి వేడుకుంటున్నా కనికరించలేదు. దీంతో ఆరేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది నిరుద్యోగులు పరీక్షలు రాయకుండానే ఉద్యోగాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయారు. తమకు ఒక్క చాన్స్ కూడా ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల ఆవేదన అర్థం చేసుకుని అడిగిందే తడవుగా వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచారు. కానీ ఈ జగన్ ప్రభుత్వం మాత్రం ససేమిరా లేదు, పొమ్మన్నారు.



కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24: ప్రతి యేటా జనవరిలో జాబ్‌క్యాలెండరు విడుదల చేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన సీఎం ఐదేళ్లుగా జాబ్‌క్యాలెండరు మాటేమో కానీ కనీసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు పోటీ పరీక్షల అర్హత వయసు దాటిపోయారు. కడప జిల్లాలోనే దాదాపు వేల సంఖ్యలో అనర్హత బారినపడ్డారు. జగన్ ప్రభుత్వం నోటిఫికేషన్‌లు ఇవ్వకుండా చేసిన జాప్యానికి పలువురికి వయోపరిమితి దాటిపోవడంతో నిరుద్యోగులు బలైపోయారు. అయినా వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు వయో పరిమితి సడలించేందుకు నిరాకరించింది. తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమ వయోపరిమితిని 44 నుంచి 47కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోటీ పరీక్షల్లో ఉద్యోగం పొందేందుకు సీనియర్ నిరుద్యోగులకు ఇదే చివరి అవకాశం అవుతుంది. వీరు ఈ సారి ఉద్యోగం పొందలేకపోతే ఇక ఉద్యోగం వచ్చే అవకాశం ఎంత మాత్రం ఉండదని చెప్పాలి. మిగిలిన వారందరికీ ఈ నోటిఫికేషన్ కాకపోతే మరో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంటుంది కానీ సీనియర్లకు అలా కాదు. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవీయ కోణంలో కూడా ఆలోచించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

టీడీపీ హయాంలో పలుమార్లు సడలింపు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వయోపరిమితిని సడలించి నిరుద్యోగులకు ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించారు. గ్రూప్-1, 2, డీఎస్సీ నోటిఫికేషన్‌లు రెండుసార్లకు పైగా ఇచ్చారు. వీటితో పాటు పలు శాఖల ఇంజనీరింగ్, డిగ్రీ లెక్చరర్, హాస్టల్, వెల్ఫేర్ ఆఫీసరు తదితర పోస్టులకు టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని పరీక్షలకు వయో పరిమితిని సడలించింది. కానీ ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగుల ఆవేదనను మాత్రం పట్టించుకోవడంలేదు. దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వయోపరిమితి సడలించేలా సూచనలు జారీ చేసింది. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైపెచ్చు గత ప్రభుత్వాలు 36 నుంచి 42 ఏళ్లకు పెంచిన వయో పరిమితిని తాను పెంచినట్లుగా నిరుద్యోగులను వంచించేందుకు పూనుకున్నారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో వయో పరిమితి 46 ఏళ్లు ఉంది. తాజాగా మన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో వయోపరిమితి 44 ఏళ్లుగా ఉంది. వయోపరిమితి గడువు ముగిసే నిరుద్యోగులకు అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం ఇంత పట్టుదలగా ఎందుకు ఉందో ఎవరికీ అంతుచిక్కడంలేదు. పక్క రాష్ట్రాన్ని చూసి అయినా వైసీపీ ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలని, తమకు ఒక్క అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. నోటిఫికేషన్ గడువు పూర్తయినా అనుబంధ నోటిఫికేషన్‌తో తమకు మరో అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు.



వయోపరిమితి 46 ఏళ్లకు పెంచాలి..



జగన్ సర్కారు ఉద్యోగాల భర్తీకి రెగ్యులర్ నోటిఫికేషన్లు విడుదల చేయని కారణంగా నిరుద్యోగులకు వయోపరిమితి మించిపోయింది. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా వయోపరిమితి 46 ఏళ్లకు పెంచాలి. ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.10వేలు ఇవ్వాలి. లేదంటే రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు తమ ఓటు రూపంలో పాలక ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు.

- ఎం.అంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలి..



జిల్లా ఉపాధి కార్యాయలంలో పేర్లను నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కలిసి జాబ్ మేళా పేరుతో ప్రైవేటు కంపెనీల్లో అది కూడా నిరుద్యోగులను తీవ్ర ఇబ్బంది పెట్టే కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటున్నారు. అలా కాకుండా పాలక ప్రభుత్వాలే నిరుద్యోగులకు పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- కన్నెలూరు శంకర్, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఒక్క నోటిఫికేషన్ కూడా లేదు..



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగాల భర్తీకి ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా మోసం చేసింది. దీని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వయసు ఎక్కువై నిరుద్యోగులుగా మిగిలారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అలాంటి ఏజ్ బార్ అయిన నిరుద్యోగ యువతకు ఒక్క అవకాశం కల్పించే విధంగా ఐదు సంవత్సరాల వయో పరిమితి పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

- సుబ్బరాయుడు, ఏఐటీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం..



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థులకు వయో పరిమితి విషయంలో తాత్సారం చేస్తోంది. ప్రస్తుతం గ్రూప్స్, డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేవారికి ఈ సమస్య తీవ్రంగా ఉంది. గ్రూప్స్‌కు 42, డీఎస్సీకి 44సంవత్సరాలు వయోపరిమితి పెట్టింది. ప్రభుత్వం ఉద్యోగస్తులకు రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలు చేసింది. నిరుద్యోగులకు కూడా వయోపరిమితి పెంచితే వారుకూడా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

- శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

బోధనకు యాప్‌ల గండం

- యాప్‌లలో వివరాల నమోదుకు సమయం వృథా
- బోధనకు సమయం సరిపోలేదంటున్న ఉపాధ్యాయులు
- యాప్‌ల భారం తగ్గించాలని కోరుతున్న ఉపాధ్యాయ సంఘాలు



మరుగుదొడ్ల ఫొటో తీస్తున్న హెచ్‌ఎం సుబ్బరాజు

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 24: పాఠశాలలో సమస్త సమాచారం తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల యాప్‌లు విద్యాబోధనకు ఆటంకంగా మారుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్తకొత్త యాప్‌లను ప్రవేశపెడుతూ నిర్దేశించిన గడువులోపు వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటంతో బోధనకు ఉపాధ్యాయులు సమయం కేటాయించలేకపోతున్నారు.

యాప్‌లలో నమోదు ఏవంటే..

- పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు మొదట ముఖ ఆధారిత హాజరు వేసుకోవాలి. సర్వర్, నెట్‌వర్క్ సమస్యల వల్ల 10 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది.
- ఉపాధ్యాయుల హాజరు పూర్తికాగానే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి మరి కొంత సమయం పడుతోంది.
- ఆ తర్వాత ఐఎంఎంఎస్ యాప్‌లో పాఠశాలలోని మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం అంతా పూర్తికావడానికి 30 నుంచి 40 నిమిషాలు సమయం పడుతోంది.
- మధ్యాహ్న సమయంలో మధ్యాహ్న భోజన వివరాలను నమోదు చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.
- పాఠశాలకు వచ్చిన బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగిజావ వివరాలను ఉపాధ్యాయులే నమోదు చేయాలి.
- నాలుగు ఎఫ్ఏ-1 పరీక్షలు, రెండు ఎస్ఏ1- పరీక్షలకు సంబంధించిన వివరాలను యాప్‌లలో నమోదు చేయడంతో పాటు థరల్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సాధించిన ప్రగతిని అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.
- అలాగే ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వివరాలను, విద్యార్థులు బైజూస్ కంటెంట్‌ను ఉపయోగించిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.
- ఇవికాక దీక్ష, నిష్ఠ, షిఫ్ట్ చార్ట్ ద్వారా ఉపాధ్యాయుల వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి.
- మండల, జిల్లా విద్యాశాఖాధికారులు అడిగిన వివరాలను ఆన్‌లైన్, యాప్‌లలో నమోదు చేయాలి.

ఇవి కాక ప్రతి ఏడాది ఉపాధ్యాయులు సొంత చేతి రాతతో లెసెన్‌ప్లాన్, డైరీలను రాయాలని అధికారులు సూచిస్తుండటంతో ఒత్తిడికి గురవుతున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో..

జిల్లాలో సుమారు 550 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఆ పాఠశాలల ఉపాధ్యాయుడే విద్యాబోధనతో పాటు యాప్‌లలో వివరాలను నమోదు చేయాలి. ఈ పాఠశాలలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఎక్కువగా ఉండటంతో వివరాల నమోదుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక టీచరే బోధన చేయాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్తకొత్త బోధన విధానాలపై ఉపాధ్యాయులు శిక్షణకు హాజరవుతుండటంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. నాడు-నేడు పనుల పేరుతో అనుభవం లేని ఇంజనీరింగ్ పనులు చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులు విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నారని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ పనిభారం తగ్గాల్సింది పోయి పని భారం పెరుగుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాబోధన చేయడం కన్నా యాప్‌లలో నమోదు చేయడం భయంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా పూర్తి సమయంలో బోధనకే పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి

- శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఉపాధ్యాయులకు బోధనేతర పనులను మినహాయించి బోధనకే పరిమితం చేయాలి. అనవసరమైన యాప్‌లను తొలగించి ప్రశాంత వాతావరణంలో బోధన జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి

- సుబ్బరాజు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై యాప్‌ల వల్ల పని ఒత్తిడి పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు

- కలెక్టర్ విజయరామరాజు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేశ్ కుమార్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సిద్ధం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను లక్ష్యం మేరకు సమర్థవంతగా అమలు చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు, రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్, హౌసింగ్, గృహ నిర్మాణం, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు, ప్రాధాన్యత భవనాలు, ఆరోగ్యం, వైద్యం, జగనన్న ఆరోగ్యసురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ బోర్డుమీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సీఎస్‌కు వివరించారు.

పుష్పగిరి వద్ద పెన్నా నది నీటిగుంతలో పడి వ్యక్తి మృతి



చెన్నయ్య మృతదేహం

వల్లూరు, ఫిబ్రవరి 24: పుష్పగిరి వద్ద పెన్నానది నీటిగుంతలో పడి చింతకొమ్మదిన్నె మండలం పోలుగారిపల్లెకు చెందిన చెన్నయ్య (43)అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు... బే ల్దారి పని చేసి జీవించే చెన్నయ్య తోటి పనివారితో కలిసి మొత్తం తొమ్మిది మంది శుక్రవారం పుష్పగిరి సమీపంలో పెన్నానదిలో డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారు. భోజనానంతరం చెన్నయ్య కనిపించకుండా పోయాడు. ఆయన సమీపంలోని నీటి గుంత వైపు వెళ్లాడని, అందులో మునిగి ఉంటాడని వారిలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమాచారాన్ని తోటి కూలీలు అతని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చెన్నయ్య భార్య గంగమ్మ తన భర్త కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి పుష్పగిరి వద్దకు వెళ్లి తోటి కూలీలను విచారించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం పుష్పగిరి చెన్నకేశవస్వామి ఆలయానికి దిగువన కొంత దూరంలో పెన్నానదిలో ఉన్ననీటి గుంతలో చెన్నయ్య మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం -వ్యక్తి అరెస్టు



వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఫారెస్టు సిబ్బంది

బద్వేలు, ఫిబ్రవరి 24: బద్వేలు అటవీశాఖ పరిధిలోని లోతువంక బీటులోని సారగొంది పాయ ప్రాంతంలో వాహనంతో పాటు 5 ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వెంకట శేషయ్య శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు అటవీ పరిధిలో దాడులు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ తమిళ సెల్వన్ శరవణనన్, మారుతీ సుజుకి స్విఫ్ట్, డిజైర్ కారులో 5 ఎర్రచందనం దుంగలను ఉంచి రవాణాకు సిద్ధంగా ఉన్న సమయంలలో అతనిపై దాడులు నిర్వహించి వాహనంతో పాటు దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు సుంకరయ్య, సువర్ణ కుమార్, రాజేష్‌రెడ్డి, ఏబీవో షాజాహాన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

వేంపల్లె, ఫిబ్రవరి 24: వేంపల్లెకు చెందిన మేదర మహిమజ్యోతి అనే విద్యార్థిని (17) ఆత్మహత్య చేసుకుందని హెడ్‌కానిస్టేబుల్ వర్మ తెలిపారు. రెడ్డయ్య కాలనీ సమీపంలో చెట్టుకు శుక్రవారం సాయంత్రం చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుందని తెలిపారు. ఉరి వేసుకున్న విద్యార్థినిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని తెలిపారు. స్థానిక ప్రైవేట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మార్కులు తక్కువగా వస్తున్నాయని ఆందోళన చెందేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంది. కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని విద్యార్థిని తండ్రి గంగన్న ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నేడు జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ ఎంపికలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 24: కడప నగరం శివానీ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు 70వ సీనియర్ జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ టీం ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ టి.జనార్దన్ తెలిపారు. ఔత్సాహిక కబడ్డీ క్రీడాకారులు 85 కేజీల లోపు బరువు కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన జట్టు వచ్చే మార్చి 8 నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరగనున్న 70వ అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్ పులివెందులకు రాక

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ సోమవారం పులివెందులకు రానున్నారు. సోమవారం ఉదయం 5-30 గంటలకు పులివెందులకు చేరుకుంటారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట లోగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4-30 గంటలకు పులివెందుల నుంచి రోడ్డు మార్గాన మచిలీపట్నం బయలుదేరి వెళతారని కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 24: పోలీసులు దుర్భాషలాడంతో పాటు కొట్టారన్న మనస్తాపంతో ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లికిచెందిన వెంకట రమణ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వెంకట రమణ కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో వెంకట రమణను ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంకటరమణ తన భార్యతో కలిసి మండల పరిధిలోని కొత్తపల్లె కూడలి వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ అక్కడే నివాసం వుంటున్నాడు. ఈ నెల 22 రాత్రి గస్తీకి వెళ్ళిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు హోటల్ మూసివేయాలని వెంకట రమణ భార్యను దుర్భాషలాడినట్లు ఆరోపించారు. మరుసటి రోజు శుక్రవారం దంపతులను పోలీసు స్టే షనుకు పిలిచి స్టేషన్లో వెంకటరమణను కొట్టారని ఆరోపించారు, దుకాణ యజమానిని పిలిపించి తమను ఖాళీ చేయించేలా పోలీసులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో వెంకటరమణ మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ సీఐ రమణారెడ్డిని వివరణ కోరగా వెంకటరమణ రాత్రి పూట హోటల్ నడుపుతుండటంపై మూసివేయమని హెచ్చరించామని అందువల్ల తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. అతన్ని పోలీసులు కొట్టలేదని తెలిపారు.

పోలీసులు కొట్టారని ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలింపు



ఆసుత్రికి తరలిస్తున్న దృశ్యం

వీరబల్లి, ఫిబ్రవరి 24: పోలీసులు కొట్టారని మనస్తాపానికి గురైన ఓ ఆటో డ్రైవర్ పోలీసు స్టేషన్ ఆవరణలోనే విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికుల, బంధువుల కథనం మేరకు వివరాలిలా.. కమ్మపల్లికి చెందిన ఆటో డ్రైవర్ శేషయ్యనాయుడు, రమేశ్‌నాయుడు అన్నదమ్ములు. వీరి కుటుంబ సభ్యులు శనివారం ఘర్షణ పడ్డారు. దాంతో రమేశ్ నాయుడు తన తమ్ముడు శేషయ్య నాయుడుపై పోలీసులకు ఫిర్యాదు చేశా రు. విచారణ పేరుతో అతనిని పోలీసులు చితకబాదడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తన తప్పు లేకున్నా పోలీసులు తీవ్రంగా కొట్టడంతో, ఓ దుకాణంలో సూపర్‌వాస్మాల్ కొనుగోలు చేసి పోలీసుస్టేషన్ గేటు వద్దనే తాగి కింద పడిపోయాడు. అది గుర్తించిన పోలీసులు 108 వాహనంలో రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

50 మద్యం సీసాల స్వాధీనం

వీరబల్లి, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని ఓదివీడు పంచాయతీ కావలిపల్లి వద్ద 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. రాయచోటి నుంచి మద్యం బాటిళ్లను తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం



వల్లూరు, ఫిబ్రవరి 24: మండలంలోని పైడికాల్వలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కన్నులపండువగా సాగిన ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చూసిన భక్తులు తరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కాగా ఉదయం రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 24: పులివెందుల పట్టణంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంగరంగవైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. శనివారం శ్రీవారి బ్రహ్మరథోత్సవం గోవిందనామస్మరణ మధ్య వేడుకగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు, అర్చకులు భరద్వాజ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణల మధ్య ఉన్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకొని టెంకాయలు కొట్టారు. ఉదయం 11గంటల సమయంలో ఆలయం నుంచి భక్తుల కోలాహలం నడుమ రథాన్ని లాగుతూ ముందుకు కదిలించారు. పట్టణంలోని పాతబస్టాండ్, పూలంగళ్ల సర్కిల్, బంగారు అంగళ్ల వీధి తదితర ప్రాంతాలలో రథం ఊరేగింది. పట్టణం గోవిందనామస్మరణతో మారుమోగింది. పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రగతి : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 24: నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం, అన్యాయం చేసిందని కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి సంజీవినిలాంటి ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందని, కడపజిలల్లాలో స్టీల్‌ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిందని, విభజన చట్టంలోని అంశాలను చాలామటుకు అమలు చేయలేదని నిప్పులు చెరిగారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత గర్హనీయమన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రభవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. ప్రత్యేక హోదా రావాలన్న, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు రావాలన్న, విభజన చట్టంలోని అంశాలు అమలుకావాలన్న అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. 26వ తేదీ సోమవారం అఖిలబారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే అనంతపురంలో ఎన్నికల శంఖారావం పూరిస్తారని, దీనిని జయప్రదం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జియాలజీ పరిశోధకుడు బాలాజీకి రూ.27 లక్షల ఫెలోషిప్

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24: వైవీయూ ఎర్త్ సైన్సెస్ విభాగం పూర్వవిద్యార్థి డాక్టర్ ఇటుకెల బాలాజీ భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్‌బోర్డు నేషనల్ పోస్టు డాక్టరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈయన పరిశోధనకు గాను డీఎస్‌టీ సెర్బ్ రూ.27లక్షలు మంజూరు చేశారు. వైవీయూ జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వెంగల సునీత మార్గదర్శకంలో బాలాజీ పట్టణ వాటర్ షెడ్ నిర్వహణ అనే అంశంపై రెండేళ్ల పాటు పరిశోధన చేయనున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి పీడీఎఫ్ పొందిన బాలాజీని అభినందించారు.

కడప రైల్వేస్టేషన్ అభివృద్ధికి రేపు వీడియోలింకు ద్వారా ప్రధాని శంకుస్థాపన

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: గుంతకల్లు డివిజన్‌లో 15 రైల్వేస్టేషన్ల పునరభివృద్ధికి వీడియోలింకు ద్వారా ప్రధాని మోదీ 26వ తేదీ సోమవారం శంకుస్థాపన చేస్తారని కడప రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 24 ఆర్‌వోబీలకు శంకుస్థాపన చేస్తారన్నారు. రాష్ట్రంలో మొత్తం 72 స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా గుర్తించారని వీటిని దాదాపు రూ.3141 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. చిన్న స్టాపేజీని కూడా గుర్తుండిపోయేలా మార్చడం, సౌకర్యాలు కల్పించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, మేయర్, జడ్పీచైర్మన్‌తో పాటు పలువురు పాల్గొంటున్నట్లు తెలిపారు.

చెన్నూరులో హైవే పనులు పదేళ్లుగా పెండింగ్

● సర్వీసు రోడ్లు వేయరు ● బస్సు షెల్టర్లు కట్టరు ● హైవే బాధితులకు ఇంటిస్థలాలు ఇవ్వరు

చెన్నూరు, ఫిబ్రవరి 24 : చెన్నూరు వద్ద హైవే రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు వేయాలి, డ్రైనేజీ కట్టాలి, బస్‌షెల్టర్లు నిర్మించాలి.. అని గత పదేళ్లుగా ప్రజలు అడుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. సమస్యలపై ప్రజలు అర్జీ పెట్టినప్పుడల్లా అధికారులు రావడం, హైవేపై కార్లు దిగడం ఇరువైపులా చూడటం త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం, నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.. అవి రాగానే పనులు చేపడతామని చెప్పడం తప్ప ఎలాంటి ఫలితమూ లేదు. దీంతో చెన్నూరు వద్ద హైవే రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏ మాత్రం పనులకు నోచుకోలేదు. ఇటీవల ఆర్డీఓగా పనిచేసిన ధర్మచంద్రారెడ్డి పలుమార్లు చెన్నూరుకు వచ్చి సమస్యలు తీరుస్తాం, మీ ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు, ఆ తరువాత బదిలీ అయి వెళ్లాడు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇక ఆ పనుల మాటే లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరులో మాత్రమే ఇలాంటి సమస్య ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు.

నిర్మాణం కాని బస్‌షెల్టర్: చెన్నూరు వద్ద హైవే రహదారికి ఇరువైపులా బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు ఎండ అయినా, వాన అయినా ఏదైనా నిలబడాల్సిందే. బస్సుషెల్టర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇంతవరకు సుముఖత వ్యక్తం చేయలేదనే చెప్పాలి. పైగా హైవే రహదారులు గతంలో ఉన్న టోల్‌ప్లాజా అధికారులు సైతం ఇదిగో వేస్తాం, అదిగో వేస్తామని చెప్పడమే తప్ప ఆ దిశగా ఏ మాత్రం పనులు చేపట్టలేదు. పైగా వారు ఆసక్తి కనబరచలేదనే చెప్పాలి. హైవే రహదారిపై చిన్న చిన్న గ్రామాల వద్ద బస్‌షెల్టర్లు, సర్వీసు రోడ్లు ఉన్నా మండల కేంద్రంలో మాత్రం ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని ప్రజలే అంటున్నారు. 2009లో హైవే విస్తరణ కోసం రోడ్లు ఇరువైపులా స్థలాలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలు మండల కేంద్రంలో అభివృద్ధి పనుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.


హైవేపై సమస్యలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి (ఫైల్)

ఇంటి స్థలాలెక్కడ?: హైవే విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలకు అధికారులు స్థలాలు తీసుకున్నారు. వారందరికీ అతి తక్కువగా నష్టపరిహారం ఇచ్చారు. ప్రజలు ఇదేమని అడిగితే మీవి ఇంకా వ్యవసాయ భూములే. కమర్షియల్‌గా మార్చుకోలేదు. ప్రభుత్వం ధర ఇంతే ఉందంటూ సెంటు రూ.7వేల నుంచి 17వేల వరకు ధర కట్టించి ఇచ్చారు. అప్పటికే కొత్తరోడ్డు ప్రాంతంలో సెంటు ధర ప్రైవేటుగా లక్షలాది రూపాయలు పలుకుతోంది. పైగా నిర్మాణాలకు కూడా అతి తక్కువగానే అందించారు. నష్టపోయిన వారందరికీ త్వరలో ఇంటిస్థలాలు కేటాయిస్తాం అంటూ సుమారు పదేళ్లకు పైగా అందరు తహసీల్దార్లు చెప్పినా ఫలితం లేదని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం కలెక్టరు విజయరామరాజు ఇటీవల చెన్నూరులో జరిగిన ఓ సమావేశంలో హైవేలో నిర్మాణాలు పోగొట్టుకున్న వారికి స్థలాలు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడంతో వారంతా దిక్కుతోచక ఆవేదన చెందుతున్నారు.


కడప టీడీపీ అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య తదితరులు

టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24 : కడప నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా రెడ్డప్పగారి మాధవీరెడ్డిని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం టీడీపీ శ్రేణులు కడప నగరంలో సంబరాలు జరుపుకున్నారు. కడప నగరంలోని ద్వారకనగర్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి నివాసంలో సందడి వాతావరణం నెలకొంది. నగరానికి చెందిన టీడీపీ ప్రముఖులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై మాధవీరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు.

పులివెందుల అభ్యర్థిగా బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 24: పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీటెక్ రవి పేరు ప్రకటనతో వేంపల్లెలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి భద్ర, బీసీ మండల కార్యదర్శి మడక శ్రీనివాసులు, నామా వేమకుమార్ బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. కేక్ కట్ చేసిపంచిపెట్టారు. టీడీపీ పులివెందులలో బలోపేతం అవుతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రసాద్‌రెడ్డి, రాహుల్, సుబ్బయ్య, గంగయ్య పాల్గొన్నారు.


వేంపల్లెలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 24 : తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం ఆర్.మాధవీరెడ్డిని ప్రకటించిన సందర్భంగా నగరంలోని 40వ డివిజన్ ఇన్‌చార్జ్ కర్నాటి ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచి పెట్టి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో పోరాట పటిమ, ప్రశ్నించే తత్వం, ప్రజల పట్ల ప్రేమాభిమానాలు మాధవీరెడ్డి గెలుపునకు సంకేతాలన్నారు. 40వ డివిజన్ నుండి మెజార్టీ ఓట్లు సాధిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, చెన్నయ్య, చార్లి, నరసింహం, కత్తి, పృధ్వీరాజ్, రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సహజ జీవనమే ఆరోగ్యానికి రక్ష

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24 : సహజ జీవనమే ఆరోగ్యానికి రక్ష అని, ఇది పర్యావరణకు పరిరక్షణ కూడా కీలక అంశమని జంతు శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ సావిత్రి పేర్కొన్నారు. శనివారం కడప కేంద్రీయ విద్యాలయంలో సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సహజ జీవన విధానం అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాపును ప్రిన్సిపాల్ మీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాలుష్యం లేని సహజ జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు.

సతీష్‌రెడ్డితో వైసీపీ నేతల భేటీ

వేంపల్లె, ఫిబ్రవరి 24: శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సింగారెడ్డి సతీష్ కుమార్‌రెడ్డితో వైసీపీ నేతలు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, కడప మేయర్ సురేష్‌బాబు భేటీ అయ్యారు. వైసీపీలో చేరాలని ఆహ్వానించారు. సతీష్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి టీడీపీలోనే ఉన్నారు. పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోటీగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచి పోరాడారు. 2019 శాసన సభ ఎన్నికల అనంతరం టీడీపీకి రాజీనామా చేసి దూరంగా ఉంటున్నారు. ఐదేళ్లుగా ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాలుపంచుకోలేదు. ఈసారి పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీటెక్ రవిని అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో వేంపల్లెలోని స్వగృహంలో ఉన్న సతీష్‌రెడ్డిని శనివారం రాత్రి వైసీపీ నేతలు కలిశారు. సుమారు గంటకుపైగా చర్చలు జరిపారు. పార్టీలోకి రావాలని కోరారు. రెండు మూడు రోజుల్లో అనుచరులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని సతీష్‌రెడ్డి వైసీపీ నాయకులకు తెలిపారు. అలాగే లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి విషయం చర్చించినట్లు తెలుస్తోంది. ఆయన వైసీపీలో చేరేందుకు సహకరించాలని వారు కోరినట్లు సమాచారం.

'జర్నలిస్టులపై దాడులు వైసీపీ రాక్షసపాలనకు పరాకాష్ట'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 24: 'జర్నలిస్టులపై దాడులు వైసీపీ రాక్షసపాలనకు పరాకాష్ట' అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతిరూపాలుగా నిలిచే నాలుగు స్తంభాలలో ఒకటైన పత్రికారంగాన్ని వైసీపీ ప్రభుత్వం అంతం చేయాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్న తీరు దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాఫియా పాలనకు ప్రజలు అంతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుండి అరాచక పాలనకు తెరలేపిందన్నారు.


మాట్లాడుతున్న వంగళ శశిభూషణ్‌రెడ్డి

వైవీయూలో పరిసరాలను పరిశీలించిన వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24 : వైవీయులో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి కుదుట పడి సాధారణ పరిస్థితులు నెల కొన్నాయని వైవీయు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. శనివారం వైస్‌చాన్సలర్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ఇంజనీరు రాజశేఖర్‌రెడ్డి, వార్డెన్లు, సిబ్బందితో కలిసి వసతిగృహాలు వాటి పరిసర ప్రాంతాలు పరిశీలించారు. తాగునీటి ట్యాంకులు, పైపులైన్లు, మురుగుకాల్వలు, నీటి నిల్వలు ఉన్నపరిసర ప్రాంతాలు పరిశీలించారు. కొత్త ఆర్వోప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు అందించారు. విధులు బాధ్యతగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే పులివెందులలో పోటీకి సిద్ధం'

వేంపల్లె, ఫిబ్రవరి 24: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏఐసీసీ సభ్యులు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆశీస్సులతో, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సహకారంతో పులివెందులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి: ఏఐఎస్ఎఫ్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24:వైవీయూలో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. శనివారం వైవీయూలో వైస్‌చాన్సలర్‌ను కలిసి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిర్లక్ష్యం వహించిన అధికారుల పట్ల యూనివర్సిటీ పెద్దలు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అరుణ్, నాయకులు చంద్ర, అకిరానంద్, అశోక్, శివతేజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Limited, Kadapa.1 Branch issues the following notice to the general public.My client intend to grant loan **Sri. Shaik Mohammad Rafi Son of Shaik Gaffoor Sab.** resident of D.No.16/486, Ghouse Nagar,Kadapa City, YSR District by mortgaging the below schedule mentioned property as security by way of equitable mortgage. As such if anyone has any claims, objections, charges or mortgages. sale agreements, court attachments, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice,otherwise matter objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTIES: All that piece and parcel of the Commercial building bearing Door No.20/518 and Door No.20/518-2, situated at YSR District, Kadapa Sub District. Kadapa Municipal Corporation Area, Kadapa Town Towards Apsara Theatre Road, northern side,Ground Floor, 1st Floor and 2nd Floor of RCC Building within the limits of Nagarajupalli Village fields bearing survey No 18/1 to an extent of 66 7/9 square yards

BOUNDARIES: EAST: House of Late Shaik Khajafer Haseen, **WEST:** Joint wall of S.Khader Mohiddin house, **NORTH :** House of Sattar miah, **SOUTH:** Public ro

Yours faithfully
SHIAK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions from my client M/s Shriram Finance Limited, Pulivendula branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Sudham Iswarya,W/oJagadheeswara Reddy residing at D. No. 1/89, Bonala village & Post, Lingala Mandal, YSR district** under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks financial institutions are any individual money lenders are here by informed that if any objections regarding the said loan property, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned property, otherwise it shall be deemed that there are no objections from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below mentioned schedule property.

SCHEDULE : YSR Kadapa District, Kadapa registration- district,Pulivendula Sub-District, Pulivendula Municipal area, Peddarangapuram village fields, S.No. 98/2 out of it East-West 19.75 feet or 6.019 meters, North - South 60 feet or 18.288 meters (131.66 Sq.Yards) measures comprise open site part in 6th plot within the following

BOUNDARIES:EAST: Remaining open site 19.75 feet width of part in plot No. 6 belongs to Jammula Lakshmidevi, **WEST :** 18 feet width of road; **NORTH:** 20 feet width of road, **SOUTH :** belongs to Sekhar Reddy.

A.Narasimha Reddy
Advocate, Pulivendula.

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైంది

● తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైందని, అందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కడప నగరం 33వ డివిజన్‌లో శివలింగం బీడీ ఫ్యాక్టరీ ప్రాంతంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో ఎన్నికల షెడ్యూలు వెలువడనుందని, వైసీపీ ప్రభుత్వ ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ సంసిద్ధులై రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నాయకులు రవిశంకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, బిట్టా శ్రీధర్, అఖిల్, అప్సర్‌ఖాన్, సుధాకర్, మిధున్‌కుమార్, కిరణ్, అఖిల్‌కుమార్, రమణ, దేవతిరమణ, ఈశ్వరయ్య ఉస్మాన్, గంగిశెట్టి వెంకటేష్, నాగరాజు, ఆచారి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి తదితరులు

పాత పెన్షన్ ఇచ్చినవారికే మా ఓటు : యూటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24 :మన భవిష్యత్తు నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నాయకులే కావచ్చు అయితే వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించేది మాత్రం మన ఓటే అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. శనివారం యూటీ ఎఫ్ కార్యాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు 30 సంవత్సరాల పైబడి ప్రభుత్వ సేవలో పనిచేసినప్పటికీ వారికి వృద్ధాప్యంలో భరోసా కల్పించే పెన్షన్ అందించకుండా ఆర్థిక భారం పడుతుందనే నెపంతో అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు.

రేపు అనంతపురంలో కాంగ్రెస్ పునర్నిర్మాణ పోరాట సభ

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: అనంతపురంలో ఈనెల 26న కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణ పోరాట సభ జరగనుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ నేతలు పాల్గొంటారని, జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నేడు అందుబాటులో విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయం

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 24 : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యదావిధిగా పనిచేస్తాయని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వ్యక్తి అరెస్టు - మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప (క్రైం), ఫిబ్రవరి 24 : చిన్నచౌకు పరిధిలో బండారి శేఖర్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండడంతో దాడి చేసి అతని వద్ద ఉన్న 36 క్వార్టర్ మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆ మేరకు ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.


అరెస్టయిన వ్యక్తి, సీజ్ చేసిన మద్యం బాటళ్లను చూపుతున్న సీఐ, ఎస్ఐ

టీడీపీని ఆదరించండి: బీటెక్ రవి

చక్రాయపేట, ఫిబ్రవరి 24: టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. శనివారం మండలంలోని గడ్డంవారిపల్లె, గొంది, మద్దికవాండ్లపల్లె, కాలనీ, కొత్తపల్లె, మూలపల్లె గ్రామాలలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమానికి బీటెక్ రవి హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే పథకాలను వివరించారు. అలాగే చెరువుకాంపల్లెలో ఎద్దుల చంద్ర ఆహ్వానం మేరకు రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న బీటెక్ రవి

రాష్ట్ర భవిష్యత్తుకు బాబునే గ్యారంటీ: పుత్తా


సీకేదిన్నె, ఫిబ్రవరి 24: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడే గ్యారంటీ ఇవ్వగలరని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ బోడెద్దులపల్లెలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు మినీ మేనిఫేస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రత్యేక పథకాలు అందిస్తుందని, ఉచిత బస్సు సౌకర్యంతోపాటు చదువుకునే ప్రతి ఒక్కరికి అమ్మఒడి, ఉచితంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు అందించడంతోపాటు 18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500, చదువుకున్న నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు అందిస్తారన్నారు. ఏ ప్రభుత్వంలో మేలు జరుగుతుందో ప్రజలు గమనించి మోసపోకుండా టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, జబివుల్లా, డీవీ సుబ్బారెడ్డి, రెడ్డిబాష, దర్బార్‌బాష, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

వైభవంగా సాగుతున్న విజయదుర్గాదేవి బ్రహ్మోత్సవాలు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 24: కడప నగరం బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో మూడవరోజైన శనివారం మాఘపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామున పుణ్యనదీజలాలతో నింపిన తొమ్మిది మహాపవిత్రశాలకు విశేష పూజలు నిర్వహించారు. ఆ మేరకు 9 మంది దంపతులు వెంటరాగా ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్, ఆ పవిత్ర కలశాలతో ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో మూడు ప్రదక్షిణలు నిర్వహించారు.

ఆ మహా పవిత్ర కలశాల్లోని పుణ్యనదీజలాలతో అమ్మవారికి నవకలశస్నపనం (విశేష అభిషేకం) నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు యాగశాలలో చండీహోమం నిర్వహించారు. తదుపరి శ్రీచక్రమండపంలో నవావరణ, శ్రీచక్రార్చనలు జరిగాయి. చండీహోమ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి సతీమణి చండీహోమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు 108 మంది ముత్తైదువులచే అమ్మవారికి 108 దీపాలతో దీపాలంకార సేవ గావించారు. అనంతరం రాత్రి 8 గంటలకు విజయదుర్గా-మల్లికార్జునులు వృషభవాహనంపై ఆలయ ప్రదక్షిణ గావించగా భక్తులు తిలకించి పులకించారు.



ప్రత్యేక అలంకారంలో విజయదుర్గాదేవి... కలశాలతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దుర్గాప్రసాద్

గిట్టుబాటు ధర అడిగితే తుపాకీతో కాల్చి చంపుతారా : సీపీఐ

వేంపల్లె, ఫిబ్రవరి 24: రైతులు పండించినపంటకు గిట్టుబాటు ధర మరియు రైతు సంక్షేమం కోసం స్వామినాథన్ సిఫారసు అమలు చేయాలని డిమాండ్ చేస్తోంటే తుపాకీతో కాల్చి చంపుతారా అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, బాష, వేముల మండల కార్యదర్శి చాంద్‌బాషలు అన్నారు. శనివారం వారు వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో రైతు ఆందోళనలో చనిపోయిన శుభంసింగ్ రైతుకు రూ.50లక్షల నష్టపరిహారం ప్రకటించాలన్నారు. రైతులను అణచివేయాలని చూస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు నోరుమెదపకపోవడం దారుణమన్నారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన శ్రీరంగడు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 24: పులివెందులలోని శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పూలంగళ్ల కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిరోజు స్వామివారి గ్రామోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాసవుల చిన్నమ్మ కథ ఏర్పాటుచేశారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి,పాలక మండలి సభ్యులు మాధవాచారి, మల్లికార్జున, రాజశేఖర్, సోమేశ్వరమ్మ, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి, మహేశ్వరి, ఆలయ ఈఓ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

వేంపల్లె, ఫిబ్రవరి 24: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆన్యువల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలను డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంభూపాల్‌రెడ్డి, డీన్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 : త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్నందున ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జేఏసీ ఉద్యమ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పాఠశాలలోని ఉపాధ్యాయులను కలసి వారి సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిన ఆరు నెలలకు సిబ్బందిని నియమించిందన్నారు. 2023 జూలై 1 నుంచి వర్తించే విధంగా ఐఆర్ ప్రకటించాలన్నారు. మార్చి 15వ తేదీలోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రూ.33వేల కోట్లను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, ఆసిఫ్ హుస్సేన్, బాబుల్‌రెడ్డి, మద్దిలేటి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



బి.కోడూరు, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని దంతెలపల్లె గ్రామంలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల నుంచి దాదాపు 300 జంటలు పాల్గొని పూజలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి కోలాటం, హరిభజనలు ఘనంగా నిర్వహించారు.

కన్నుల పండువగా సీతారామ, శివ పార్వతుల కల్యాణం



బద్వేలు, ఫిబ్రవరి 24: పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డు దిగువ బ్రాహ్మణ వీధిలో ఉన్న కాశీ విశ్వనాథ, సీతారామ లక్ష్మణ హనుమత్సమేత, అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సీతారామ, శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాయంత్రం కోలాటంతో పాటు పూలంగి సేవ, ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

ఐసీటీ అకాడమీ, ఏపీఎస్ఎస్‌డీసీతో వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ఒప్పందం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ఐసీటీ అకాడమీ, ఏపీఎస్ఎస్‌డీసీలతో ఒప్పందం చేసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు తెలిపారు. శనివారం కళాశాలలో ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి గుజ్జుతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, అధ్యాపకులు ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 24 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో వేల కోట్ల ఇసుక దోపిడీ

రేగళ్ళపల్లె వద్ద ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆందోళన



రేగళ్ళపల్లె పెన్నానది వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 24 : వైసీపీ ప్రభుత్వంలో నదులలో వున్న సహజ వనరైన ఇసుకను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు దోపిడీ చేసి వేల కోట్లు అక్రమంగా సంపాదించారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని రేగళ్ళ పల్లెలోని పెన్నా నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అక్కడి టీడీపీ కార్యాకర్తలతో వెళ్ళి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అధికార వైసీపీ నేతలు ఈ ఐదేళ్ళలో 200 వందల కోట్లు అక్రమంగా సంపాదించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇసుకను పేదలకు ఉచితంగా ఇస్తే నేడు టన్ను ఇసుక 500 నుంచి రేట్లు పెట్టి ప్రభుత్వమే విక్రయించి వేల కోట్లు సొమ్ము చేసుకుంటుందన్నారు. ఒకవైపు ప్రభుత్వం ఖజానా నింపుకుంటే మరోవైపు అక్రమ ఇసుక రవాణాతో వైసీపీ నేతలు వందల కోట్ల రూపాయలు తమ ధనాగారాలలో నింపుకున్నారన్నారు. ప్రజలు ఇప్పటికైనా వైసీపీ దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే నదులు, కొండలు, గుట్టలు, భూములు ఏవీ మిగలవన్నారు. కార్యక్రమంలో సీతంపల్లె సర్పంచ్ చంద్రమోహన్, లాయర్ చంద్రశేకర్ కల్లూరు నరసింహరావు, తాళ్లమాపురం అంకిరెడ్డి, ప్రొద్దుటూరు నియెజకవర్గ అబ్జర్వర్ ఏవీఆర్ ప్రసాద్, జనసేన నాయకుడు మాదాసు మురళీ విశ్వనాథ రెడ్డి, ఆవుల దస్తగిరి, వెంకట సుబ్బారెడ్డి, పద్మనాభరెడ్డి ప్రసాద్, శూలం శివప్రసాద్, పల్లా లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అరాచకపాలనను సాగనంపాలి





బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారు, ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న వరద, కొండారెడ్డి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 24 : వైసీపీ అరాచకపాలనను సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని సుమిత్రా నగర్‌లో వైసీపీ నుంచి సిమెంటు షరీఫ్‌తో సహా వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలోకి సిమెంటు షరీఫ్, మహ్మద్‌బాషా, బాబు సాహెబ్, మౌలాలి, రజాక్ సప్లయర్స్, ఎస్‌కేఎం మహబ్బాషా, దావుద్, అమీర్‌బాషా, ఖాదర్‌బాషా, ముస్తఫా, ఉస్మాన్, అంజద్, అస్లాం, జగన్‌మోహన్‌రెడ్డి, పెంచలయ్య, జానీబాషా తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ పార్థసారధి, వెంగలరెడ్డి,మిత్తికాయల రమణ, ఝాన్సీరాణి, జహంగీర్ బాషా, బిగ్‌బాస్, రాంభూపాల్‌రెడ్డి,హసన్, పీఆర్పీ బాషా, రామసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో వ్యాపార వర్గాలకు టీడీపీ అండ

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 24 : వైసీసీ ప్రభుత్వం వచ్చినప్పటినుంచి ప్రొద్దుటూరులో వ్యాపార వర్గాలు భయాందోళనలతో బతుకులీడుస్తున్నారని వారికి టీడీపీ అండగా వుంటుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం కూరగాయ మార్కెట్ మండిబజార్‌లలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నాగమునిరెడ్డి, బచ్చల ప్రతాప్, ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు తలారిపుల్లయ్య, వద్దిబాలుడు, మార్కెట్ అధ్యక్షుడు యకిన్‌వల్లి ఖలందర్, షబ్బీర్, గౌస్‌ఖదీర్, మండి బజార్ అధ్యక్షుడు రోషన్, కార్యదర్శి రామక్రిష్ణా రెడ్డి పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల 17వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న సరస్వతి, జ్యోతి

ఎర్రగుంట్ల..: జమ్మలమడుగులో టీడీపీని భారీమెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, సతీమణి జ్యోతి శనివారం ప్రచారం నిర్వహించారు. ఎర్రగుంట్ల 17,18వార్డుల్లో వారు బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను మహిళలకు వివరించారు. ఈకార్యక్రమంలో ఇమాంబాషా, కే.శ్రీను, చిన్నసేట్, పెద్దసేట్, ఖాసీంపీరా, బాలరాజు, సురేంద్ర, సోమాచారి, చాంద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 24: ఈనెల 26వ తేదీ అనంతపురం జిల్లాలో జరుగు కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, వైఎస్ షర్మిల తదితరులు హాజరవుతున్నారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బహిరంగసభకు తరలి రావాలని ఆయన కోరారు.

కాశిరెడ్డినాయన ఆలయంలో అన్నదానం

కొండాపురం, ఫిబ్రవరి 24: మండలంలోని చౌటిపల్లె గ్రామంలో వెలసిన కాశిరెడ్డినాయన ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 : ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు ఆదివారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు గీతాశ్రమంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందన్నారు. పదో తరగతిలో భౌతిక శాస్త్రం నుంచి 50 మార్కులు, జీవ శాస్త్రం నుంచి 50 మార్కులతో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి తెలుగు, ఇంగ్లీషు మీడియాల్లో వేర్వేరుగా ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి రూ.1000,కన్సొలేషన్ బహుమతి రూ.500, పాల్గొన్న ప్రతి విద్యార్థికి పెన్ను, ప్యాడ్ అందిస్తామన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

కొండాపురం, ఫిబ్రవరి 24: మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలో శనివారం ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం జరిగింది.ఈ సందర్భంగా ధ్వజ,శిఖర,కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను భూపేశ్ ప్రారంభించారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 : జగనన్న కాలనీల పేర్లతో ఊర్లు నిర్మిస్తామంటున్న ప్రభుత్వం అమృతానగర్‌లో పేదల ఇళ్ల స్థలాలకు మౌలిక వసతులు కల్పించడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. అమృతానగర్‌లోని పేదల ఇళ్ల స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని 31 రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారన్నారు. శనివారం రాజీవ్ సర్కిల్‌లో లబ్ధిదారులతో కలసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, వెంకటేష్, పుష్పలత, హసీనా, మల్లికభాను, షకీల, సరస్వతి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 24 : మార్చి 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించి విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆటో గేటును రద్దు చేయాలి

మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 24 : ఆటో గేటును రద్దు చేయాలంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.శనివారం స్థానిక ఆటో దినసరి గేటును రద్దు చేయాలంటు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జరుగుతున్న దినసరి బస్టాండ్ వేలంపాటను అడ్డుకోవడం జరిగింది.అసలే డీజల్ ధరలు పెరిగి, గిరాకీలు లేక అల్లాడుతున్న ఆటో కూలీలకు గేటు రుసుం చాలా ఇబ్బందిని కలిగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీరాములు,షావలి,వీరయ్య, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాపాడు, ఫిబ్రవరి 24: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న 30 మద్యం బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటిపై దృష్టి పెట్టండి

బి.కోడూరు, ఫిబ్రవరి 24 : వచ్చేది వేసవి కాలమని, ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటిపై దృష్టి పెట్టాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో భాస్కరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పాల్గొని తమ తమ సేవల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, మండల వైస్ ప్రెసిడెంటు శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా
మండల సమావేశం

అట్లూరు, ఫిబ్రవరి 24 : అట్లూరు మండలం సమావేశం శనివారం ఎంపీపీ పి.రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అరకొరగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కాగా ఎటువంటి ఎజెండా లేకుండానే తూతూ మంత్రంగా మండల సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమానికి మండల జడ్పీటీసీ సభ్యురాలు నరసమ్మ, ఎంపీడీవో ఎస్.అమానుల్లా, మండల ఉపాధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

100 శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలి : డీఈవో



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో అనురాధ

కాశినాయన ఫిబ్రవరి24: త్వరలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ పేర్కొన్నారు. శనివారం నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,మోడల్ హైస్కూల్, ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల బోధనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో వచ్చిన ఫలితాలను అడిగి తెలుసుకోవడంతోపాటు ఈవిద్యా సంవత్సరం ప్రతి విద్యార్థి పాసయ్యేదానికోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అన్నఅంశంపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మార్సీకార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈమె వెంట స్థానిక ఎంఈవో నిర్మల పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్టు

ముద్దనూరు ఫిబ్రవరి24:స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శనివారం మట్కా నిర్వహిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.ముద్దనూరుకు చెందిన షేక్ నూర్‌బాబా, జమ్మలమడుగు మండలం గూడెం చెరువుకు చెందిన షేక్ షబ్బీర్ మట్కా నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.20,100 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత బస్టాండ్‌లో చిరువ్యాపారులను ఆదుకుంది నీవా..?

ఎమ్మెల్యే రాచమల్లును ప్రశ్నించిన కొవ్వూరు బాలచంద్రారెడ్డి



ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 24 : ప్రొద్దుటూరులో గతంలో పాత బస్టాండును కూల్చితే అక్కడ చిరువ్యాపారులకు అండగా నిలబడింది ఎమ్మెల్యే రాచమల్లు కాదని బీజేపీ సీనియర్ నేత కొవ్వూరు బాలచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పాత బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాత బస్టాండును కూల్చిన వెంటనే బంకులను అన్నింటినీ క్రేన్‌లు పెట్టి వాటిని చక్కబెట్టింది తానే నన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం వెంటనే తన స్వంత నిధులతో తడికెలతో పందిరివేశానని కొవ్వూరు బాలచంద్రా రెడ్డి పేర్కొన్నారు. ప్రయాణీకులకు ఉచితం భోజనం సదుపాయం ఏర్పాటు చేశానన్నారు. ఎమ్మెల్యేగా వున్న రాచమల్లు వ్యాపారుల కోసం ఏమీ చేయకున్నా అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బస్టాండుకూడా గతప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయన్నారు. 2019 ఎన్నికల ముందు రెండు సెంట్లలో ఇళ్ళని ర్మించి ఇవ్వకుంటే 2024లో మీ ముఖం చూడనని ప్రజలకు చెప్పిన ఎమ్మెల్యే ఏముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నాడన్నారు. రాచమల్లు అబద్ధాల కోరుఅని అతనిని నమ్మి మరో సారి ప్రజలు మోస పోవద్దని కోరారు.

అంధకారంగా ప్రధాన రోడ్లు



అంధకారంలో రైల్వేస్టేషన్, నాగులకట్ట రోడ్డు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 24: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రొద్దుటూరు రోడ్డుకు వెళ్లే దారి, సర్కిల్‌లో వీధిలైట్లు వెలుగక అంధకారంగా మారాయి. ప్రతి శుక్రవారం అదే ప్రాంతంలో గొర్రెల సంత జరుగుతుంది. తెల్లవారుజామున గొర్రెలను వివిధ వాహనాల్లో యజమానులు తరలిస్తారు. అక్కడికి చేరుకునేసరికి అంధకారంగా ఉంటుందని అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సర్కిల్‌లో వీధి లైటు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే రైల్వేస్టేషన్ ఎదురుగా నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు వెళ్లే రోడ్డులో బైపాస్ రోడ్డు నుంచి చీకటిగా ఉంటుంది. నాగులకట్ట రైల్వేస్టేషన్ వెళ్లే దారి మరీ దారుణంగా విద్యుత్తు స్తంభాలు ఉన్నప్పటికీ వీధి బల్బులు లేక అంధకారంగా అలంకారప్రాయంగా మారాయి. ఆ దారిలో చీకటి పడగానే రాత్రివేళల్లో రైళ్లు వస్తాయి. ప్రయాణికులు వెళ్లాలన్నా ఆటోలలో వెళ్లాల్సి ఉంటుందని, లేకపోతే కొందరు నడిచి వెళ్లాల్సి వస్తోందని, దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టా

ఖరారు చేసిన అధిష్ఠానం ● సంబరాల్లో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు

ఖాజీపేట, ఫిబ్రవరి 24: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ కాబోయే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం బస్టాండు కూడలిలోని గాంధీ విగ్రహానికి, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి బాణాసంచా పేల్చి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మిల్లు శ్రీను అతిథిగా హాజరయ్యారు. నాయకులు వీరయ్య, సుబ్బయ్య, సిద్దారం కదీరుల్లా, పాపన మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, రాము, పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, శ్రీనివాసులు, క్రిష్ణారెడ్డి, డాక్టర్ ఆసీఫ్, వెంకటయ్య, కేకే బ్రదర్స్ పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు తెలుగుదేశం పార్టీ టికెట్ ఎట్టకేలకు పుట్టా సుధాకర్ యాదవ్‌కు కేటాయించడంపై టీడీపీ, జనసేన నాయకులు,కార్యకర్తలు,పుట్టా అభిమానులు స్థానిక రాయల్ కూడలి వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. జనసేన,టీడీపీ ఉమ్మడి టికెట్లను టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం విడుదల చేయగా అందులో మైదుకూరుకు పుట్టా సుధాకర్‌యాదవ్ పేరును ఖరారు చేయడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆకుల క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్ బీఎన్ శ్రీనివాసులు,పరంధామయ్య, లక్ష్మీనారాయణ, మేకలచిన్నా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ బీఎన్ శ్రీనివాసులు,పాలమాబు తదితరులు పాల్గొన్నారు.

పుట్టాకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 24 : తెలుగుదేశం, జనసేన ఉమ్మడి తొలి జాబితాలో మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ పేరు ఖరారు చేయడంతో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మాజీ యంపీపీ ధనపాల జగన్, సీనియర్ నాయకులు కటారిక్రిష్ణ, ఏపిరవీంద్ర, కోన సుబ్బారావు తదితరులు హైదరాబాదులోని పుట్టా కార్యాలయంలో కలిసి స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపునకు కృషి చేస్తాం

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 24 : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపునకు కృషి చేస్తామని బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు శనివారం మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్‌ను ప్రకటించడం జరిగిందని, ఈ సందర్భంగా బి.మఠం ఐదు రోడ్ల కూడలిలో బాణసంచా పేల్చి మిఠాయిలను పంపిణీ చేసుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఈ సారి వంద శాతం పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపునకు మేమంతా కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా చూడడమే తమ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పెనల ఈశ్వర్‌రెడ్డి, ప్రముఖ లాయరు తిప్పన పట్టాభిరామ్, చిలమల నాగయ్య, రమణయ్య, తిప్పన జయరాంనాయుడు, గంగయ్య, కొడపాటి వెంకటేష్ నాయుడు, సురేంద్ర, బాలాగౌడ్, బండి ఓబయ్య, వెంగల్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





ఖాజీపేటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు, మైదుకూరులో స్వీట్లు పంచుకుంటున్న తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు